

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు.. అంతా సిద్ధం
- జిల్లాలో ఐదు పరీక్ష కేంద్రాలు.. 16,634 మంది అభ్యర్థులు

భీమవరం ఎడ్యుకేషన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకాలకు నిర్వహిస్తున్న మెగా డీఎస్సీ 2025 పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలో ఐదు కేంద్రాల్లో 30వ తేదీ వరకు ఈ పరీక్షలను రెండు సెషన్స్‌గా, 24న 3 సెషన్లుగా పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం తొమ్మిది గంటలకు, మధ్యాహ్నం రెండు గంటలకు పరీక్షలు ప్రారంభమవుతాయి. నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా హాజరు కావాలి. మొత్తం 16,634 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్, డీఎన్నార్ డిగ్రీ, తాడేపల్లిగూడెంలో శశి ఇంజనీరింగ్, శ్రీవాసవి ఇంజనీరింగ్, నరసాపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తారు. డీఎస్సీ పరీక్ష రాసేందుకు వెళ్లే అభ్యర్థులకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉంటుంది. అన్ని ఏర్పాటు చేసినట్లు డీఈవో నారాయణ తెలిపారు.



మైదానం నుంచి మరుభూమి వైపు

బీజాపూర్ పోలీస్ కాల్పుల్లో మావోయిస్ట్ సుధాకర్ మృతి

జిల్లాలో 40 ఏళ్ల క్రితం నక్సల్స్ సంచలనం.. పెదపాడు మండలం సత్యవోలు గ్రామానికి చెందిన విద్యార్థి తుపాకి వైపు మొగ్గు చూపారు. ఇంట్లో చెప్పకుండా విద్యాభ్యాసం చేస్తున్న విజయవాడ నుంచి నేరుగా మావోయిస్టు ఉద్యమం వైపు కదిలారు. ఈ విషయం తెలిసి స్వగ్రామంతోపాటు మిగతా గ్రామాలు కూడా వణికిపోయాయి. అప్పుడలా వెళ్లిన విద్యార్థి ఇప్పుడు నిర్జీవంగా కనిపించారు.

- స్వగ్రామం ఏలూరు జిల్లా సత్యవోలు
- 40 ఏళ్ల క్రితం నక్సల్ ఉద్యమంలోకి
- మావోయిస్ట్ అగ్రనేతగా కీలక బాధ్యతలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మావోయిస్టు ఉద్యమంలో అగ్రనేత ఎదిగిన తెంటు సుధాకర్ గురువారం బీజాపూర్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. మూడు దశాబ్దాలుగా సుధాకర్ కోసం పోలీసు వేట కొనసాగుతోంది. ఒకప్పటి పీపుల్స్ వార్.. తర్వాత మావోయిస్టు పార్టీలో వ్యూహకర్తగా సుధాకర్ ఎదిగారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మావోయిస్టు కార్యకలాపాలు ఉధృతం కావడంలో సుధాకర్ కీలకంగా వ్యవహరించారు. రెండు రాష్ట్రాల పోలీసు బలగాలకు కంట్లో నలుసయ్యారు. మారుమూల గ్రామాల్లో గిరిజనుల మద్దతు కూడగట్టడంలో ఆయన పాత్ర మావోయిస్టు అగ్రనేతలను సైతం సంతృప్తిపరిచింది. ఆయనకున్న ఉద్యమ అనుభవం, తీసుకున్న నిర్ణయాలు మావోయిస్టు క్యాడర్‌ను అటవీ ప్రాంతంలో విస్తరించడం ద్వారా ఆయన పదేళ్ల క్రితమే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారని చెబుతారు. ఆయనపై పోలీసులు పలు కేసులను నమోదు చేశారు. సాధ్యమైనంత మేర సుధాకర్ లొంగిపోయేలా ఆయన కుటుంబంపై ఒత్తిడి చేసినట్లు ప్రచారం సాగింది. సుధాకర్ మాత్రం అటవీ ప్రాంతంతోపాటు ఆయుధాన్ని వదలలేదు. నాలుగు దశాబ్దాలపాటు నక్సల్స్ ఉద్యమంలో సుదీర్ఘంగా ప్రయాణించారు. ఆయన ఆచూకీ కోసం పోలీస్ బలగాలు ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే వచ్చాయి. ఆయన తలకు రూ.50 లక్షల రివార్డు ప్రకటించారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జాతీయ అటవీ పార్కు వద్ద సుధాకర్‌ను ఎన్‌కౌంటర్ చేశారు. సుధాకర్ అసలు పేరు కాగా పోలీస్ రికార్డుల్లో టీఎల్ఎన్ చలం, ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, ఆర్ఆర్, అరవింద్, సోమన్న అనే పేర్లు కూడా ఉన్నాయి. ఆయనపై వివిధ స్టేషన్లలో అనేక కేసులు ఉన్నాయి. సీలేరు, ముక్కువ, ఎల్విన్‌పేట, అన్నవరం తదితర పోలీస్ స్టేషన్లలో ఆయనపై కేసులున్నాయి.

2004 శాంతి చర్చల్లో..

2004లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం అప్పట్లో నక్సల్స్‌ను చర్చలకు పిలిచింది. జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేశారు. దీనితో మావోయిస్టు అగ్రనేత ఆర్‌కేతోపాటు తెంటు సుధాకర్, ఆయన సతీమణి కాకరాల సునీత అలియాస్ ఉమా పాల్గొన్నారు. చర్చల అనంతరం తిరిగి అజ్ఞాతంలోకి వెళ్లిన సుధాకర్ స్వగ్రామం వైపు కన్నెత్తి చూడలేదు. పోలీసుల కంట పడలేదు. తాజాగా జరిగిన ఎన్‌కౌంటర్‌లోనే నిర్జీవంగా కనిపించారు.



ఏదీ స్పందన

- జిల్లాలో 42,051 ఆక్వా చెరువులు
- 1.33 లక్షల ఎకరాలకు రిజిస్ట్రేషన్ అయింది 50 వేలే
- నాన్ ఆక్వా జోన్‌లో 13 వేల ఎకరాలు
- పూర్తయిన సర్వే.. ప్రభుత్వానికి నివేదిక
- ప్రతి ఎకరానికి రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- త్వరలోనే రైతులకు నోటీసులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆక్వా రంగంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న చెరువులకే విద్యుత్ రాయితీ, ఇతర ప్రోత్సాహకాలు లభించనున్నాయి. విద్యుత్ విషయంలో ఇప్పటికే మంత్రి మండలి ఆమోదం తెలిపింది. రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసింది. పది ఎకరాల లోపు చిన్న, సన్న కారు ఆక్వా రైతులకు మాత్రమే యూనిట్ విద్యుత్ రూ.1.50కు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వంలోనూ ఇదే విధానాన్ని అమలుచేశారు. అప్పట్లో నాన్ ఆక్వా జోన్‌లో వున్న చెరువులకు రాయితీ ఇవ్వలేదు. తాజాగా నాన్ ఆక్వా జోన్‌పైనా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోనుంది. జిల్లాలో చెరువులు, విస్తీర్ణంపై ఇటీవల సమగ్ర సర్వే చేశారు. సచివాలయాల్లోని ఫిషరీస్ అసిస్టెంట్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివరాలు నమోదు చేసుకున్నారు. మత్స్య శాఖ కమిషనర్‌కు జిల్లా అధికారులు నివేదికను సమర్పించారు. ప్రభుత్వ ఆమోదంతో త్వరలోనే మార్గదర్శకాలు విడుదల కానున్నాయి. తదనుగుణంగా రిజిస్ట్రేషన్‌ల కోసం రైతులకు నోటీసులు జారీ చేయనున్నారు.

50 శాతంలోపే రిజిస్ట్రేషన్

పశ్చిమలో 50 శాతంలోపే చెరువులకు రిజిస్ట్రేషన్‌లు చేశారు. జిల్లాలో 1.33 లక్షల ఎకరాల్లో ఆక్వా చెరువులు విస్తరించి వుంటే 42,051 ఎకరాల్లో మాత్రమే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో వైపు మొత్తం విస్తీర్ణంలో 13 వేల ఎకరాలు నాన్ ఆక్వా జోన్‌లో ఉన్నాయి. వాటిని ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకురానున్నాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న చెరువులకు మాత్రమే విద్యుత్ రాయితీ వర్తింపజేయనున్నారు. అందరికీ విద్యుత్

మిగతా 8వ పేజీలో

డిజిటల్ మా లక్ష్మి

- సీఎస్‌సీ సెంటర్ల ఏర్పాటు ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు
- పొదుపు సంఘాల మహిళల దరఖాస్తు.. జిల్లాలో 300 మంది అర్హత
- మీ సేవ కేంద్రాల్లోని అన్ని సేవలను ఈ సెంటర్ల ద్వారా పొందవచ్చు



పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది.పట్టణాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు వివిధ రూపాల్లో ఉపాధి పొందేందుకు తోడ్పాటును కల్పిస్తోంది. మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దే క్రమంలో డీజీ లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్ల (సీఎస్‌సీ) ఏర్పాటు చెయ్యాలని నిర్ణయించింది. ఈ సెంటర్ల ద్వారా ప్రజలకు డిజిటల్ సేవలు అందిస్తూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా ఈ పథకానికి రూపకల్పన చేసింది. ఈ నెల 8న రాష్ట్రంలో ఈ పథకం ప్రారంభం కానుంది.

(భీమవరం టౌన్-ఆంధ్రజ్యోతి):

డిజిటల్ ఇండియాలో భాగంగా జిల్లాలోని పట్టణాల్లో డిజిటల్ లక్ష్మి కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్‌సీ) ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే సెంటర్ల ఏర్పాటుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. మీ సేవ కేంద్రాల్లో అందించే వివిధ రకాల డిజిటల్ సేవలను ఇకపై ఈ సెంటర్లలో ఎంపికైన పొదుపు సంఘాల మహిళలు అందించనున్నారు. మహిళల ఎంపిక రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుంది. జూలై మొదటి వారంలో ఇవి ప్రారంభం కానున్నాయి.

ఒక్కో సెంటర్‌లో ముగ్గురు

ఒక్కొక్క సెంటర్‌లో ముగ్గురు ఉపాధి పొందవచ్చు. నెలకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తుంది. ఈ సెంటర్ల ఏర్పాటుకు పట్టణ ప్రాంతాల్లోని స్లమ్ లెవల్ సమాఖ్య(ఎస్ఎల్ఎఫ్) పరిధిలోని పొదుపు సంఘం నుంచి డిగ్రీ చదివిన వారిని ఎంపిక చేస్తున్నారు. ఒక్కొక్క ఎస్ఎస్ఎఫ్ పరిధిలో 25 స్వయం సహాయక సంఘాలు ఉంటాయి. వీటిల్లో 250 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్క ఎస్ఎస్ఎఫ్ నుంచి ఒక మహిళను డీజీ లక్ష్మి సేవలకు ఎంపిక చేస్తున్నారు. ఎంపికైన మహిళకు రూ.2 లక్షల రుణం అందిస్తారు. ఈ మొత్తంతో కంప్యూటర్, దానికి అనుబంధ పరికరాలు సమకూర్చుకోవచ్చు.

సేవలు ఇలా..

మీ సేవ కేంద్రాల్లో అందిస్తున్న రేషన్ కార్డులు, పాస్‌పోర్టు, ఆధార్, ఓటరు కార్డు, జనన, మరణ ధ్రువీకరణల మంజూరు, బ్యాంకు ఖాతా తెరవడం, డబ్బుల డిపాజిట్, విత్ డ్రా వంటి బ్యాంకింగ్ సేవలు ఉంటాయి. ఈ విద్యార్థులకు సర్టిఫికెట్లు, వివిధ కోర్సుల్లో చేరడానికి నమోదు, ఆరోగ్య బీమా పాలసీలు, వ్యవసాయ సేవలనందిస్తారు. జిల్లాలోని భీమవరంలో 76 సెంటర్లు, నరసాపురం 28, పాలకొల్లు 65, తణుకు 48, ఆకివీడు 18 సెంటర్లు ఏర్పాటు కానున్నాయి.

లక్ష్యం చేరేందుకు కృషి



డిజిటల్ లక్ష్మి కార్యక్రమంలో జిల్లాకు 300 మంది లక్ష్యంగా ఇచ్చారు. మునిసిపాల్టీల వారీగా ఇచ్చిన లక్ష్యాలను అందుకునేందుకు మహిళలకు అవగాహన కల్పించి దరఖాస్తులు చేసుకునేలా చర్యలు చేపట్టాం. ఎంపికైన మహిళలకు శిక్షణ ఇస్తాం. తర్వాత కేంద్రాన్ని ఏర్పాటు చేసి సేవలందిస్తారు.

- సీఎంఎం గ్రంధి లక్ష్మి పార్వతి

లాసెట్, ఎడ్ సెట్ ప్రశాంతం

తాడేపల్లిగూడెం రూరల్/భీమవరం రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం లా సెట్, ఎడ్ సెట్ ప్రశాంతంగా జరిగాయి. ఎడ్ సెట్‌కు.. డీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 110 మందికి 88, డీఎన్ఆర్ అటానమస్ కళాశాలలో 87 మందికి 57, విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో 80 మందికి 60, విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 80 మందికి 44 మంది విద్యార్థులు హాజరయ్యారు. లాసెట్‌కు.. డీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 110 మందికి 88, డీఎన్నార్ అటానమస్ కళాశాలలో 100 మందికి 84, తాడేపల్లిగూడెం వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో 491 మందికి 394 మంది హాజరయ్యారు.

మరో 4 రోజులు ఉక్కబోత

పాలకొల్లు అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి):రోహిణీ కార్తెతో ఐదు రోజులుగా ఎండలు మండుతున్నాయి. భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు తదితర ప్రాంతాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి వేడిగాలులు వీయడంతో ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ప్రజలు ఇళ్లల్లో నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎండ వేడి, వడగాల్పులతో ప్రజలు శీతల పానీయాల షాపులు, చలివేంద్రాల వైపు పరుగులు తీస్తున్నారు. రోహిణీ కార్తె మరో నాలుగు రోజులు కొనసాగుతున్న కారణంగా అప్పటి వరకు ఈ ఉక్కబోత తప్పేలా లేదు.

రిజిస్ట్రేషన్లకు సర్వర్ కష్టాలు

ఆచంట, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ శాఖలో తరచూ సర్వర్ల సమస్య వెంటాడుతోంది. ఇటీవల తీసుకువచ్చిన స్లాట్ బుకింగ్ విధానం మొదట్లో బాగానే ఉంది. కాని, వారం రోజులుగా పబ్లిక్ డేటా తయారు చేసే సమయంలో ఆధార్ ఓటీపీ వంటివి ఉపయోగించుకునే విషయంలో సర్వర్ సరిగ్గా పని చేయక రిజిస్ట్రేషన్‌లు జరగడం లేదు. వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి. కాని అధికారులు పట్టించుకోవడం లేదు. దీనివల్ల రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ డౌన్ కావడంతో గంటల తరబడి అవి పనిచేయడం లేదు.

ఓ వైపు ఎండలు మండిపోతుండడంతో రిజిస్ట్రేషన్లు సరిగా కాక ఉద్యోగులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. స్లాట్ బుకింగ్ చేసేటప్పుడు సర్వర్ పని చేయక పోవడంతో రీ షెడ్యూలు కొట్టేందుకు అదనంగా రూ.200 చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు అన్ని కార్యాలయాల్లోనూ ఆధునికీకరించి తరచూ నెట్ సర్వర్ సమస్య లేకుండా సజావుగా రిజిస్ట్రేషన్‌లు అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఆరోపణలు నిరూపించు.. రాజీనామా చేస్తా

కారుమూరికి ఎమ్మెల్యే ఆరిమిల్లి సవాల్



తణుకు, జూన్ 5(ఆంధ్రజ్యోతి):'నాపైన, నా కుటుంబ సభ్యులపైన నిరాధార ఆరోపణలు చేస్తున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు వాటిని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా. నిరూపించలేకపోతే నువ్వు ఏం చేస్తావు' అంటూ తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సవాల్ విసిరారు. గురువారం క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'కారుమూరి చేసిన పాపాలను నాపై రుద్దాలని చూస్తే ఊరుకునేది లేదు. నా ఇంట్లో మహిళల జోలికి వస్తే అస్సలు సహించేది లేదు. అధికారంలో ఉన్నపుడు కె టాక్సు పేరుతో ప్రజలను దోచుకున్న కారుమూరి ఆగడాలను ప్రజలు మర్చిపోలేదు. అక్రమ మైనింగ్ ఎవరి పేరుతో ఉంది ? గ్రానైట్ మైనింగ్ ఎవరు కొల్లగొట్టారు ? అక్రమ సంపాదనతో సౌతాఫ్రికా, దుబాయ్‌ల్లో పెట్టుబడులు ఎలా పెడుతున్నావు ? నీ స్థాయి ఏమిటి ? ఇన్ని వేల కోట్లు ఎలా వచ్చాయి ? అధికారంలో ఉన్నపుడు ఎంత మంది పీఏలను మార్చావు ? ఎంత మంది సిబ్బందిని మార్చావు ? ప్రజలకు తెలుసు. రాజకీయాలు హుందాగా చేయాలి. నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదు. కాంగ్రెస్, వైసీపీల్లో ఎంతమంది వెన్నుపోటు పొడిచి ఈ స్థాయికి వచ్చావో అందరికి తెలుసు. ఇపుడు ముసలి కన్నీరు కారుస్తుంటే, దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్లు ఉన్నాయి' అని మండిపడ్డారు.

నేరం చేయాలనే ఆలోచనే రాకూడదు

డిప్యూటీ స్పీకర్ రఘురామ.. డ్రోన్ కెమెరా ఆవిష్కరణ



డ్రోన్ ఎగురవేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ, చిత్రంలో ఎస్పీ నయీం

ఆకివీడు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 'ప్రతి ఒక్కరిలోనూ నేరమనే ఆలోచన రాకుండా చేయడమే నా లక్ష్యం. అందుకే రాష్ట్రంలోనే తొలిసారి ఉండి నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కలుపుతూ ప్రత్యేక ఫైబర్ గ్రిడ్ ఏర్పాటు చేశాం. దీని ద్వారా సీసీ కెమెరాలు ఆపరేటింగ్ సిస్టంను సిద్ధం చేశాం' అని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పష్టం చేశారు. ఆకివీడు మండలం అజ్జమూరు సీఐ కార్యాలయంలో డ్రోన్ కెమెరాను ఎస్పీ అద్నాన్ నయీం అస్మితో కలిసి ప్రారంభించారు. నియోజకవర్గానికి తొలి డ్రోన్ కెమెరాను పోలీస్ సిబ్బందికి అందజేశారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా దాతలు, స్నేహితుల సహకారంతో ఇవి ఏర్పాటు చేస్తున్నట్లు రఘురామ తెలిపారు. నియోజకవర్గంలో రియల్ టైమ్, ర్యాపిడ్, రెస్పాన్స్(ఆర్ఆర్ఆర్) కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేస్తున్నట్లు సీఐ జగదీశ్వరరావు తెలిపారు. దీనివల్ల నేరాలు తగ్గి, భవిష్యత్‌లో నేరం చేయాలనే ఆలోచన ఎవరికీ రాదన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా రఘురామకృష్ణ సీఐ కార్యాలయంలో మొక్కలు నాటారు. డీఎస్పీ జైసూర్య, సీఐ జగదీశ్వరరావు, ఎస్ఐలు జుత్తిగ నాగరాజు, మోటుపల్లి రామవరప్రసాద్, నౌకట్ల రామారావు, బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, బచ్చు సరళ, ఆముదాల నాని తదితరులు పాల్గొన్నారు.



ఫర్నిచర్ షాపు దగ్ధం.. కోటి ఆస్తి నష్టం !

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి):ఏలూరు సమీపంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో గణేష్ సోఫాస్ అండ్ ఫర్నిచర్ వర్క్స్ షాప్, గోడౌన్‌లో గురువారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం జరిగి కోటి రూపాయల వరకు నష్టం వాటిల్లింది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో కార్మికులు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. మూడు ఫైర్ ఇంజన్ల ద్వారా సిబ్బంది నాలుగైదు గంటలపాటు కష్టపడి మంటలను అదుపు చేశారు.

15న పదోన్నతి కౌన్సెలింగ్

ఆలోగా రెగ్యులర్ ఏఎన్ఎంలకు బదిలీలు

నేడు ఎస్జీటీలకు పదోన్నతి కౌన్సెలింగ్

7



రాష్ట్రం పచ్చగా ఉంటే జగన్ ఓర్చుకోలేడు

- మంత్రి నిమ్మల



ప్రమాణం చేయిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):'రాష్ట్రం పచ్చగా, సుభిక్షంగా ఉంటే జగన్ చూసి ఓర్చుకోలేడు. ఆయన ఐదేళ్ల విధ్వంసకర పాలనలో మొక్కలను, చెట్లను నరకడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఓ వైపు జగనన్న పచ్చతోరణం పేరిట మొక్కలు నాటే కార్యక్రమం పెట్టి.. మరోవైపు సీఎం హెలికాప్టర్‌లో వెళుతున్నా రోడ్ల పక్కన చెట్లను నరికేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అడవులు, మొక్కలు పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది' అని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. గురువారం పాలకొల్లు చంద్రబాబునాయుడు మున్సిపల్ పార్కులో నిర్వహించిన వన మహోత్సవంలో పాల్గొని ప్రతిజ్ఞ చేయించారు. సీఎం చంద్రబాబు రాష్ట్రంలో కోటి మొక్కలు నాటడంతోపాటు, ప్లాస్టిక్ నివారణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కమిషనర్ బి.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో వ్యర్థాలను తొలగించాలి : కలెక్టర్

భీమవరం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):'కాలువ గట్లపై కొబ్బరి బొండాల విక్రయాలు జరుగుతున్నాయి. తాగిన వారు బొండాలను కాల్వల్లో వేస్తున్నారు. దీని వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇక్కడ ఈ బళ్లు పెట్టడానికి వీల్లేదు. వీటిని తక్షణం తొలగించాలి. అలాగే భీమవరం పట్టణంలోని నాలుగు ప్రధాన కాల్వల్లో కాలువల్లో వ్యర్థాలను తొలగించాలి' అని కలెక్టర్ నాగరాణి స్పష్టం చేశారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'వనం - మనం పేరిట' పేరిట జిల్లాలో 3.85 లక్షల మొక్కలను నాటే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. విస్సాకోడేరు కాలువ వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను, జేపీ రోడ్‌లోని అడ్డ వంతెన వద్ద కాలువ గట్లపై ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు చేపట్టారు. కలెక్టరేట్‌లో మొక్కలు నాటారు. ఎస్పీ నయీం అస్మి, జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

'ప్రభుత్వాసుపత్రుల్లో డాక్టర్లు సమయపాలన పాటించాలి. సెలవుపై వెళ్లాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఇక్కడ ప్రసవాలను ప్రోత్సహించాలి. రోగుల నుంచి ఎలాంటి సొమ్ములు వసూలు చేయకూడదు. అలా చేస్తే చర్యలు తప్పవు' అని కలెక్టర్ నాగరాణి స్పష్టం చేశారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సేవలపై వైద్యాధికారులు, సూపరింటెండెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.



చెత్తను ఎత్తుతున్న కలెక్టర్, ఎస్పీ


మొగల్తూరు కాలువలో నిలిచిపోయిన గుర్రపు డెక్క, తూడు.

ఇవేం తవ్వకాలు ?

మొగల్తూరు కాలువ పనులపై విమర్శల వెల్లువ

- కాలువ వెంబడి మట్టి పైకి ఎక్కేశారు..
- తూడు, గుర్రపు డెక్క వదిలేశారు..

మొగల్తూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పంట కాలువకు శివారు ప్రాంతమైన మొగల్తూరు ప్రధాన కాలువ తవ్వకాలపై స్థానికులు, రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిడదవోలు నుంచి ప్రవహించే ప్రధాన కాలువ మొగల్తూరు వరకూ ప్రవహించి ఇక్కడ ఉప్పుటేరులో కలుస్తోంది. ఈ కాలువలో వచ్చే నీటిని మొగల్తూరు, కేపీపాలెంతో పాటు పలు గ్రామాల రక్షిత మంచినీటి ప్రాజెక్టులకు, వ్యవసాయ అవసరాలకు వినియోగిస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే తూడు, గుర్రపు డెక్క, జంతు, మానవ కళేబరాలు ఇక్కడ పేరుకుపోవడంతో నీరు దుర్వాసన రావడంతో కలుషితంగా కాలువ మారుతోంది. గత వైసీపీ పాలనలో ఈ కాలువ ప్రక్షాళన చేయకపోవడంతో మరింత సమస్య ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది వేసవిలో కాలువ తవ్వకం ప్రక్షాళన పనులు చేపట్టడంతో కాలువ తవ్వకం చేశారు. కేవలం అక్కడక్కడా కాలువకు ఇరుపక్కలా గట్ల వెంబడి మట్టి పైకి ఎక్కేశారు గాని లోతు తవ్వలేదని కాలువలో ఉన్న గుర్రపుడెక్క, తూడు యథావిధిగా ఉండిపోవడంతో తవ్వకం పనులతో ఉపయోగం ఏమిటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. కాలువను చూస్తే ఎప్పుడో తవ్వారనే విధంగా ఉందని, కేవలం మట్టితీసి గట్టుమీద పెట్టినట్టుందని, తూడు కూడా ఎక్కేయని పరిస్థితి ఉంది. ఈ తవ్వకాల వల్ల కాలువ నీరు కలుషితం అయ్యే అవకాశం ఉందని అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శివారు ప్రాంత రైతులు, ప్రజల అవసరాలను దృష్ట్యా కాలువ తవ్వకం పనులు క్వాలిటీ కంట్రోల్ అధికారులతో రైతుల సమక్షంలో తనిఖీలు చేసి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న యోగాసన చిత్రాలు

గోడలపై సందేశాత్మకంగా చూడముచ్చటైన బొమ్మలు





ఏలూరు ఇండోర్ స్టేడియం ప్రహరీపై వేసిన యోగాసనాల చిత్రాలు

ఏలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలోని పలు ప్రధాన సెంటర్లలో ఒకప్పుడు గోడలన్నీ పోస్టర్లతో పెయింట్ రాలిపోయి అంద వికారంగా కనిపించేవి.. కానీ ఇప్పుడు జిగేల్ మనిపించే కలర్స్‌తో, సందేశమిచ్చే అందమైన బొమ్మలతో చూడముచ్చటగా దర్శనమిస్తున్నాయి. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆలోచనతో మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో గోడలన్నింటిపై సందేశాత్మక, మహాత్ముల చిత్రాలతో కూడిన వాల్ పెయింటింగ్స్ ఇప్పుడు నగర ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇప్పటికే కలెక్టర్ కార్యాలయం చుట్టూ గోడలపై అద్భుతమైన వాల్ పెయింటింగ్స్ వేయించారు. రైతులు, యువత, చిన్నారులు, మహిళలు, ఇలా అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించేలా వేసిన సందేశాత్మక చిత్తరువులతో కొత్త అందాలను సంతరించుకుంది. తాజాగా ఈనెల 21న యోగాడే సందర్భంగా ఇండోర్ స్టేడియం చుట్టూ ఉన్న గోడలపై యోగ భంగిమలు పెయింటింగ్ వేస్తున్నారు. ఆర్టిస్టులుగా తమ ఉనికిని కోల్పోతున్న సమయంలో కలెక్టర్ తమకు జీవనోపాధి కల్పించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అందమైన బొమ్మలను గీయడంలో నిమగ్నమైన ఆర్టిస్టులు వేసిన పెయింటింగ్స్ చూపరులను కట్టిపడేస్తున్నాయి.

చింత తొలగేనా ?

పనులపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం

- సుప్రీం కోర్టు ఆదేశాలతో నిలిచిన పనులు
- టీడీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చినా ముందుకు కదలని పనులు


నూజివీడు నియోజకవర్గంలోని చింతలపూడి కాలువ

నూజివీడు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎత్తిపోతల పథకం ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలలోని మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేసే కాలువ. రూ.4,909 కోట్లు వ్యయంతో రెండు ఫేజ్‌లలో ఈ ఎత్తిపోతల పథకం పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటికి 50 శాతం పనులు పూర్తయ్యాయి. పర్యావరణ అనుమతులు లేకుండా ఈ చింతలపూడి ఎత్తిపోతల పథకం చేపట్టారని పేర్కొంటూ ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే దివంగత వట్టి వసంత కుమార్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్ 2022లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.72 కోట్లు జరిమానా విధించింది. దీనిపై అప్పటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించగా మూడు నెలల్లో జరిమానా చెల్లించడం లేదా పర్యావరణ అనుమతులు పొందాలని ఆదేశించింది. జగన్ ప్రభుత్వం కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంతో సుప్రీంకోర్టు చింతలపూడి పనులను నిలిపివేయాలని ఉత్తర్వులు జారీ చేయడంతో చింతలపూడి పథకం పనులు అప్పటి నుంచి నిలిచిపోయాయి.

ప్రాధాన్యం ఇచ్చినా..!

2024లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వం ప్రకటించిన ప్రధాన ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఒకటి. ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తవుతోంది. ఇప్పటికే ఈ పథకానికి రూ.2,500 కోట్లు వరకు ప్రభుత్వం ఖర్చు చేసింది. సుప్రీం కోర్టు విధించిన రూ.72 కోట్లు అపరాధ రుసుము ప్రభుత్వానికి ఒక లెక్క కాదు. ఈ పథకం ఆలస్యమయ్యే కొద్ది రైతులకు జరిగే నష్టాన్ని పరిశీలిస్తే చెల్లించాల్సిన అపరాధ రుసుము చాలా చిన్నది. రెండు జిల్లాల్లోని సుమారు ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు వందలాది గ్రామాలకు తాగునీరును ఈ పథకం ద్వారా గోదావరి జలాలను అందించవచ్చు.

చాట్రాయి మండలంలో వేంపాడు సాగర్ కాలువలోకి ఈ చింతలపూడి కాలువ అనుసంధానం అవుతుంది. వేంపాడు ద్వారానే కింద మండలాలైన ముసునూరు, ఏలూరు జిల్లాలోని వట్లూరు వరకు ఈ గోదావరి జలాలు అందుతాయి. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో చింతలపూడి కాలువ పనులు వేగవంతం కావడంతో చాట్రాయి మండలంలో వేంపాడు సాగర్ కాలువపై కిందకి నీరు వెళ్లడానికి కోసం నిర్మించిన కట్ అండ్ కవర్‌ను తొలగించడంతో ఇప్పుడు సాగర్ నీరు ఈ రెండు మండలాలకు అందని పరిస్థితి. ఇటు సాగర్ నీరు రాక అటు చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందని పరిస్థితి నెలకొంది.

అడ్డంకులు ఇవే..

ఈ పథకానికి గ్రీన్ ట్రిబ్యునల్ విధించిన అపరాధ రుసుముతో పాటు ఫేజ్-1, ఫేజ్-2 లో రైతులకు నష్టపరిహారంగా చెల్లించాల్సింది కలిపి సుమారు రూ.175 కోట్లు ఉంటుంది. ఈ పథకంలో భాగంగా ఉన్న జల్లేరు రిజర్వాయర్ కెపాసిటీని 8 నుంచి 16 టీఎంసీలకు పెంచడంతో కొంత భూభాగం తెలంగాణ రాష్ట్రంలోకి వెళ్లడంతో ఇది రెండు రాష్ట్రాల సమస్యగా మారింది. ఈ రిజర్వాయర్‌లో కొంత భూభాగం అటవీశాఖకు చెంది నది కావడంతో దానిని డీనోటిఫై చేయాల్సి ఉంది. ప్రభుత్వం శ్రద్ధ చూపితే త్వరితగతిన వీటిని పరిష్కరించవచ్చని ఆదిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మందగించిన 'తమ్మిలేరు' మరమ్మతులు

కాంట్రాక్టర్‌కు రూ.6 కోట్లు బిల్లుల పెండింగ్

- జైకా నుంచి అనుమతులు లేక బిల్లులు విడుదల జాప్యం
- టీడీపీ ప్రభుత్వంలో ఇప్పటికే 50 శాతం పనుల పూర్తి

కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల కాకపోవడంతో తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతు పనులు మందగించాయి. జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేషన్ ఏజన్సీ (జైకా) నుంచి అనుమతులు రావాల్సి ఉండగా.. బిల్లులు చెల్లింపులో జాప్యం జరుగుతున్నట్టు తెలిసింది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాలుగా తమ్మిలేరు ప్రాజెక్టుకు మరమ్మతులు లేకపోవడంతో శిథిలావస్థకు చేరిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాట్రాయి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు కృషితో జపాన్ బ్యాంకు (జైకా) నిధులు రూ.16 కోట్లు మంజూరయ్యాయి. టెండర్లు ప్రక్రియ పూర్తయ్యి కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టే సమయానికి 2019 ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రివర్స్ టెండరింగ్ పేరుతో టెండరును రద్దు చేసింది. 2021లో వైసీపీ సర్కార్ టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ని ఖరారు చేసినా మూడేళ్లలో ఎడమ కాలువలో కేవలం రూ.1.64 కోట్ల విలువైన పనులే జరిగాయి. బిల్లులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రాజెక్టును సందర్శించి పనులు పునఃప్రారంభానికి చర్యలు తీసుకున్నారు. కొన్ని నెలల వ్యవధిలోనే కుడి, ఎడమ, మధ్య కాలువల పనులు సుమారు 50 శాతం జరగడం విశేషం. మే నెల మొదట్లో ఇరిగేషన్ అధికారులు బిల్లులను అప్‌లోడ్ చేశారు. నిధులు లేక బిల్లులు వెనక్కి రావడంతో కాంట్రాక్టర్ పనుల వేగాన్ని తగ్గించారు. కాంట్రాక్టర్‌కి సుమారు రూ.6 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. ప్రభుత్వం బిల్లులు విడుదల చేసి తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


పోలవరం వద్ద రైట్ కెనాల్‌పై నిర్మించిన స్లూయిజ్ (ఫైల్)

త్వరలోనే బిల్లులు విడుదల

బిల్లుల అప్‌లోడ్ సమయంలో నిధులు లేకపోవడంతో బిల్లులు వెనక్కి వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించింది. కాంట్రాక్టర్‌కి రావాల్సిన బిల్లులు అప్‌లోడ్ చేస్తున్నాం. త్వరలోనే బిల్లులు విడుదల అవు తాయి. మిగతా పనులు త్వరలో చేపట్టి పూర్తి చేస్తాం.

- సీతారామ్, డీఈ తమ్మిలేరు ప్రాజెక్టు


పనులు పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ అధికారులు (ఫైల్)
మేజర్-2పై నిర్మిస్తున్న స్లాబ్ కల్వర్టు (ఫైల్)


సినీ నటి అనన్య నాగెళ్లను ఆశీర్వదిస్తున్న అర్చకులు

మావుళ్లమ్మకు అనన్య పూజలు

భీమవరంటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): భీమవరం పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారిని సినీనటి అనన్య నాగెళ్ల గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమె ముందుగా అశ్వత్థ గణపతికి పూజలు చేయించుకున్నారు. తదుపరి అమ్మవారిని దర్శించుకోగా ఆలయ ప్రధాన అర్చకుడు మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలను నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. దేవరస్థానం తరఫున ప్రసాదాన్ని, శేష వస్త్రాన్ని, అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఉన్నారు. అనంతరం పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వరస్వామిని, విద్యాగణపతిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు.

అరుదైన ఆరడుగుల కంద మొక్క

పాలకొల్లు అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కంద మొక్క సుమారు 3, 4 అడుగుల వరకు పెరిగి చనిపోయిన తరువాత కంద దుంపను తవ్వి తీసుకుంటారు. చాలా అరుదుగా పెద్దగా పెరుగుతాయి. పోడూరు మండలం మట్టపర్రు గ్రామంలోని గోపరాజు సీతామహాలక్ష్మి నివాసంలో అరుదైన కంద మొక్క పెరిగింది. ఆరు అడుగులపైగా పెరిగిన కంద మొక్క చూపరులను ఆశ్చర్య పరుస్తోంది. గత డిసెంబరు నుంచి మొక్క ఎదుగుతోందని, ఇటీవల కురిసిన వర్షాలకు మరింత పెరిగిందని సీతామహాలక్ష్మి, ఆమె కోడలు అన్నపూర్ణ తెలిపారు.


కంద మొక్క వద్ద అత్త, కోడలు సీతామహాలక్ష్మి, అన్నపూర్ణ

వావ్.. పది కేజీల చేమ దుంప

టి.నరసాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): సాధారణంగా చేమ దుంపల బరువు 100 గ్రాముల నుంచి ఒక కేజీ వరకు మాత్రమే ఉంటాయి. దానికి విరుద్ధంగా టి.నరసాపురం మండలం బొర్రంపాలెంలో మిడతా నాగమణి ఇంటి పెరటిలో ఏడాది క్రితం వేసిన చేమదుంప పెరిగి పెద్దదై సుమారు 10 కేజీల బరువు వరకు తయారై పలువరిని ఆశ్చర్యపరుస్తుంది. ఈ మొక్కకు పశువుల ఎరువు, నీరు, సమృద్ధిగా ఉండడంతో దుంప సైజు బాగా పెరిగినట్లు ఆమె తెలిపారు.


చేమదుంపను చూపుతున్న మిడతా నాగమణి

యోగాతో ఆరోగ్యం సొంతం : ఆరిమిల్లి

తణుకు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో యోగా చేయడం ద్వారా ఆరోగ్యం సొంతం చేసుకోవచ్చని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. గురువారం తణుకులోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో ఉద్యోగులు, పట్టణ ప్రజలతో కలసి ఆయన యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విశాఖలో ఐదు లక్షల మందితో ప్రధానమంత్రి మోదీ పాల్గొనే విధంగా సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారని వివరించారు. విశాఖ ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు ఐదు లక్షల మందితో యోగా నిర్వహించి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో నమోదు చేసే విధంగా ప్రణాళిక చేస్తున్నట్లు పేర్కొన్నారు.


యోగాసనాలు వేస్తున్న ఆరిమిల్లి

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా స్వీకరించాలి

ఏలూరు క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని, ప్లాస్టిక్ వసువులు, క్యారీ బ్యాగుల వాడకానికి స్వస్తి పలికి, గుడ్డ సంచులను వాడాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఇన్‌చార్జి చైర్మన్, ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వనం-మనం కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించి, జిల్లా కోర్టు ప్రాంగణంలో మొక్కలను నాటి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు విధిగా కనీసం రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో విధిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసి భూగర్భజలాలను వృద్ధికి సహకరించాలని సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతిలోని సమతుల్య స్థితిని కాపాడాలని పర్యావరణ పరిరక్షణ అనే అంశాలపై ప్రజలకు న్యాయ విజ్ఞాన సదస్సులతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఐ. శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీటీ కృష్ణసాయితేజ, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి మహ్మద్ అబుతాలిబ్‌షేక్, తదితరులు పాల్గొన్నారు.


కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న ఇన్‌చార్జి జిల్లా జడ్జి శ్రీనివాసరావు

- పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉమ్మడి జిల్లాల న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో పలు పరిశ్రమల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాలుష్య నివారణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.వెంకటేశ్వరరావు, పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా కోర్టు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


శ్రీవారి ఆలయ ప్రాంగణంలో వివాహం, ఉపనయనం దృశ్యాలు

వెంకన్న ఆలయంలో రద్దీ

- జోరుగా వివాహాలు, ఉపనయనాలు
- ఆలయ పరిసరాలు భక్తులు, పెళ్లి జనాలతో కిటకిట

ద్వారకాతిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు, పెళ్లిజనాలతో కిటకిటలాడింది. ఉపనయనాలు, వివాహాలు చేసుకునేందుకు ఈ జ్యేష్ఠ మాసంలో మంచి ముహూర్తం కావడంతో గురువారం శ్రీవారిక్షేత్రం వేదికైంది. సాధా రణంగా ఉపయనాలకు మంచిముహూర్తం కుదరదు. అయితే ఈ మాసంలో ఇది మంచిది కావడంతో, ఉపనయనాలు, వివాహాలు అనివేటి మండపప్రాంతంలోను, ప్రైవేటు కల్యాణమండపాల్లో శాస్త్రోక్తంగా జరిగాయి. అన్ని క్రియలను జరిపించి శుభముహూర్త సమయంలో వటువులకు యజ్ఞోపవీత ధారణ జరిపారు. స్థానిక పాత కల్యాణమండప ప్రాంతంలోనూ ప్రైవేటు ఫంక్షన్ హాల్స్‌లోను వివాహాలు అధికంగా జరిగాయి. అన్ని కార్యక్రమాలు పూర్తయిన తర్వాత వటువులు, పెళ్లిజనాలు శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేత్రపర్వం.. నవకలశ స్నపన

- ముగిసిన కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

ద్వారకాతిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):త్రయాహ్నిక దీక్షతో జరుగుతున్న క్షేత్రదేవత కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు గురువారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. శ్రీవారి ప్రధాన ఆలయానికి ఉపాలయమైన ఈ ఆలయంలో మూడు రోజులుగా జరుగు తున్న ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని మరింత శోభాయమానంగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని విశేష పుష్పమాలలతో అలంకరించారు. తొలుత ఉదయం మూలవరులకు, ఉత్సవమూర్తులకు నవకలశస్నపన. శ్రీచక్రార్చన, సప్తశతి పారాయణ. మహాపూర్ణాహుతి హోమం శాస్త్రోక్తంగా జరిగాయి. అర్చకులు, పండితులు ఘనంగా క్రతువును జరిపారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక అలంకారాల్లో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.


కుంకుళ్లమ్మ మూలవరులకు నవకలశ స్నపన నిర్వహిస్తున్న అర్చకుడు

కనువిందు చేస్తున్న మే, రాఖీ పుష్పాలు

ఏలూరు రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా మే నెలలో ప్రకృతి ప్రేమికులను అలరించే మే పుష్పం ఆలస్యంగా వికసించి కనువిందు చేస్తున్నాయి. దుగ్గిరాలకు చెందిన ఆలీఖాన్ మహమ్మద్ ఇంటి పెరట్లో ఒకేసారి మే పుష్పాలు, రాఖీ పుష్పాలు వికసించి చూపరులను ఆకర్షిస్తున్నాయి. ఏడాదిలో మే నెలలో మాత్రమే వికసించే ఈ పుష్పాలు జూన్ మొదటి వారంలో వికసించడంతో ఆసక్తిగా తిలకిస్తున్నారు. ఫుట్‌బాల్ లిల్లీ లేదా బ్లడ్ లిల్లీ అనే అరుదైన జాతికి చెందిన ఈ పువ్వును భారతదేశంలో మే పుష్పం అని పిలుస్తారు. అన్నాచెల్లెల మధ్య మమతానురాగాల ప్రతీక రక్షాబంధన్ (రాఖీ పండుగ), రాఖీ పండుగ రోజున మార్కెట్‌లలో దొరికే రాఖీలను సోదరీమణులు వారి సోదరులకు కడతారు. అయితే ప్రకృతి ఒడిలో చెట్లకు విరబూసే రాఖీలు చాలా తక్కువ మందికే తెలుసు. కొన్నిచోట్ల మాత్రమే కనిపించే ఈ పూలు అచ్చం రాఖీని పోలి ఉండడంతో రాఖీ పూలు అని పిలుస్తారు. ఈపూల వెనుక పెద్ద కథే ఉంది. ఈ పూలను కౌరవులు - పాండవుల పూలు అని కూడా పిలుస్తారు. ఈ పూల కింది భాగంలో సన్నటి కేసరాల్లాంటి నూరు రేఖలు ఉంటాయి. వీటిని కౌరవులు అంటారు. మధ్యభాగంలో ఐదు పెద్ద రేఖలు ఉంటాయి. వీటిని పాండవులు అంటారు. అందుకే వీటిని కౌరవుల - పాండవుల పుష్పాలు అని పిలుస్తారు. ఆ పైభాగంలో ఉండే మూడు రేఖలను భీష్ముడు, ద్రోణుడు, కుంభాచార్యుడని చెబుతారు. ఈ పూలు సాయంత్రం వేళల్లో సువాసనలు వెదజల్లుతాయి.


వికసించిన రాఖీ పుష్పాలు


విరబూసిన మే పుష్పాలు

పర్యావరణ పరిరక్షణ ఒక యజ్ఞం

భీమవరం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ఒక్కరోజు జరుపుకునే వేడుక కాదని, ఇది ప్రతి ఒక్కరి జీవితంలో భాగంగా నిత్య కృత్యంగా కొనసాగాల్సిన యజ్ఞమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన ఢిల్లీలోని తన నివాసంలో అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కేంద్ర మంత్రిగా ఎన్నో బాధ్యతలున్నా పర్యావరణ పరిరక్షణకు తాను అధిక ప్రాదాన్యత ఇస్తానన్నారు.


మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి శ్రీనివాస వర్మ


ఆంధ్రా షుగర్స్ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడండి

తణుకు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఆంధ్రా షుగర్స్ జనరల్ మేనేజర్ ఎ.సాంబశివరావు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రా షుగర్స్ ప్రాంగణంలో కాలుష్య నియంత్రణ మండలి సూచనలు మేరకు వెయ్యికి పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పర్యావరణ సమతుల్యం దెబ్బతినకుండా కాపాడుకోవాలని, ప్లాస్టిక్ వస్తువులు వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. అనంతరం పలువురు ఉద్యోగులు మొక్కలు నాటారు. సంస్థ చీఫ్ కెమిస్ట్ బి.శ్రీనివాసరావు, జి.బాబూరావు, జి.ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

● సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కార్యదర్శి, సభ్యుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సమర యోధులు పార్కులో వావిలాల సరళాదేవి, మహిళలు మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

పెనుమంట్ర, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ ప్రసాద రావు పిలుపునిచ్చారు. గురువారం ఆలమూరు పంచాయతీ వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్స వాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నా రు. సర్పంచ్ వెంకట రమణ, ఎంపీటీసీ ఆశాలత, నీటి సంఘం డైరెక్టర్ తేతలి వెంకట రామారెడ్డి, బీసీ సెల్ నాయకులు కడలి ఏడుకొండలు, గురి పర మేశ్వరరావు, ఎంపీడీవో ప్రభాకర్ రావు, గ్రామ కార్యదర్శి సుధారాణి పాల్గొన్నారు.


మొక్కలు నాటిన జడ్పీ చైర్మన్ పద్మశ్రీ

నేడు ఎస్జీటీలకు పదోన్నతి కౌన్సెలింగ్

ఏలూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్, పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులకు అర్హులైన 675 మంది ఉపాధ్యాయుల వివరాలను డీఈవో ఏలూరు వెబ్ సైట్‌లో గురువారం పొందుపర్చారు. సుమారు 225 పోస్టులకు 1:3 నిష్పత్తిన అర్హులైన టీచర్లను గుర్తించగా, వీరంతా తమ సర్వీస్ రిజిస్టర్, విద్యార్హతల ధ్రువ పత్రాలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్, పదోన్నతి కౌన్సెలింగ్‌కు ఈ నెల 6న ఏలూరు జడ్పీ మీటింగ్ హాలుకు హాజరు కావాల్సి ఉంటుంది. ఉదయం 9 నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్, ఆ వెంటనే పదోన్నతి కౌన్సెలింగ్ జరుగుతాయి.

15న పదోన్నతి కౌన్సెలింగ్ !

ఆలోగానే రెగ్యులర్ ఏఎన్ఎంలకు బదిలీలు?

రెగ్యులర్, గ్రేడ్-3 ఏఎన్ఎంల సమస్యకు పరిష్కారం

ఏలూరు అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల కోసం రెగ్యులర్ ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఏ(ఫిమేల్) పదోన్నతుల కోసం గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంల వాగ్వాదం, డిమాండ్లతో బుధవారం ఉదయం నుంచి గురువారం తెల్లవారుజాము 3.30 గంటల వరకు ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద సుదీర్ఘంగా కొనసాగిన ఆందోళనకు తెరపడింది. ఇరు వర్గాలతో వేర్వేరుగా జిల్లా అధికారులు జరిపిన బుజ్జగింపు చర్యల అనంతరం ఎవరికీ నష్టం వాటిల్లకుండా ఓ ఫార్ములాను ప్రతిపాదించగా ఇరువైపులా ఆమోదం లభించినట్టు డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఆ ప్రకారం ఈ నెల 15న పదోన్నతులకు కౌన్సెలింగ్ చేపట్టడానికి నిర్ణయించినట్టు ఉమ్మడి జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యాధికారులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ గురువారం రాత్రి సమాచారం పంపింది. అప్పటి వరకు గ్రేడ్-3 సచివాలయ ఏఎన్ఎంలకు ఎటువంటి సెలవులు ఇవ్వవద్దని ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగానే ఎవరికీ నష్టం రాకుండా చర్యలు తీసుకుంటామని కార్యాలయ అధికారులు హామీ ఇవ్వడంతో ఇరువర్గాలు శాంతించినట్టు చెబుతున్నారు. ఆ ప్రకారం తొలుత సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌ను పూర్తిచేసే అవకాశం ఉంది. ఆ వెంటనే 15న పదోన్నతి కౌన్సెలింగ్‌ను చేపడతారు. దీనివల్ల ఇరువర్గాల డిమాండ్లను నెరవేర్చినట్టవుతుందని డీఎంహెచ్‌వో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు జిల్లాలో బదిలీలు, పదోన్నతుల రగడపై వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు గురువారం ఆరా తీశారు. బుధవారం జరిగిన రాద్ధాంతానికి ఓ అధికారి పరిపాలనలో పట్టుకోల్పోవడమే కారణమని వ్యాఖ్యానించినట్టు సమాచారం. మొత్తం మీద డీఎంహెచ్‌వో కార్యాలయం ప్రతిపాదించిన ఫార్ములాకు ఇరు వర్గాలు ఆమోదం తెలపడంతో జఠిల సమస్యకు శాంతియుత పరిష్కారం లభించినట్టు చెబుతున్నారు. కాగా 15న పదోన్నతుల కౌన్సెలింగ్‌పై స్పష్టత రాగా, బదిలీల కౌన్సెలింగ్ ఎప్పుడు చేపడతారో గురువారం రాత్రి వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.

ముదినేపల్లి పంచాయతీపై కైకలూరు సర్పంచ్ ఫిర్యాదు

సమగ్ర విచారణకు డీపీవో అనూరాధ ఆదేశాలు జారీ

ముదినేపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి పంచాయతీలో గత నాలుగేళ్ళలో జరిగిన ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి చేసిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి కె. అనూరాధ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 2న ఏలూరులో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ముదినేపల్లి పంచాయతీలో 2021 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మే 31 వరకూ జరిగిన ఆర్థిక అవకతవకలు, పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలని అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు కైకలూరు సర్పంచ్ నవరత్నకుమారి ఫిర్యాదు చేశారని డీపీవో తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై విచారణ నిర్వహించి 15 రోజుల్లోగా సమగ్ర నివేదికను అందజేయాలని గురువారం ఏలూరు డివిజనల్ పంచాయతీ అధికారి, ముదినేపల్లి డిప్యూటీ ఎంపీడీవో (ఈవోపీఆర్డీ)లను ఆదేశించారు. పంచాయతీల్లో అవకతవకలు, నిధులు దుర్వినియోగంపై ఆ పంచాయతీ సభ్యులు గానీ, గ్రామస్థులు గానీ ఫిర్యాదు చేయడం, విచారణ కోరడం ఆనవాయితీ. అందుకు విరుద్ధంగా ఫిర్యాదుల పర్వంలో కొత్త ఆనవాయితీ మొదలైంది. ముదినేపల్లి పంచాయతీలో అవకతవకలు జరిగాయంటూ కైకలూరు సర్పంచ్ ఫిర్యాదు చేయడం కొత్త ఆనవాయితీకి నాంది పలికినట్టు అయింది.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

● ఉమ్మడి పశ్చిమలో 13 రోడ్లకు మోక్షం ● ఆరేళ్ల తర్వాత ఆర్‌అండ్‌బీకి నాబార్డు నిధులు

ఏలూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ నుంచి రోడ్డు భవనాల శాఖకు బదలాయించిన గ్రామాల్లో పలు ప్రాంతాల మీదుగా వెళ్లే మెయిన్ రోడ్లకు ఆరేళ్ల తర్వాత మోక్షం లభిస్తోంది. ప్రభుత్వం కొలువు దీరాక కోట్లాది రూపాయలతో అత్యంత ప్రాధాన్యతగా భారీ గుంతలను పూడ్చించింది. అనంతరం గుంతలను పూడ్చటానికి వీల్లేని వాటికి రోడ్లుగా అభివృద్ధి చేయడానికి నిధులు భారీగానే ఏడాదిలో విడుదల చేసింది. తాజాగా ఆరేళ్ల క్రితం నుంచి రాని నాబార్డు నిధులిచ్చి ఉమ్మడి ఆర్‌అండ్‌బీ సర్కిల్ పరిధిలో 13రోడ్లకు మోక్షం కల్పిస్తోంది. నిధులు మంజూరు చేయడంతో అధికారులు ఎట్టి పరిస్థితుల్లో ఈ నెలాఖరులోగా టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించారు. వేగంగా ఆగస్టు నాటికి అన్ని రోడ్లు గ్రామీణ ప్రాంతాల్లో పూర్తి చేసి రాకపోకలకు అనువుగా చేయడానికి దృఢ సంకల్పంతో ఉన్నారు. ప్రధానంగా నాబార్డు ఆర్ఐడీఎఫ్ ట్రంచ్ 30 కింద ఈ పనులను మంజూరు చేశారు. వైసీపీ హయాంలో ఈ నిధులు మచ్చుకైనా రాలేదని, ప్రభుత్వం ఉన్నత స్థాయిలో గతంలో పంపిన ప్రతిపాదనలకు కార్యరూపం దాల్చే దిశగా అడుగులు వేసిందని అధికారులు చెబుతున్నారు. గత ఆరేళ్లలో ఒక్కపని కూడా ఈ పథకం చేయ లేదని, అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు.

రోడ్లకు నిధులు ఇలా..

లింగపాలెం నుంచి పుప్పాలవారిగూడెం వయా సింగగూడెం వరకు 4 కిలోమీటర్ల మేర రూ.కోటి 60 లక్షలు రోడ్డకు బీటీ వేయనున్నారు. మనుకొల్లు నుంచి కోటపాడు వయా చీపురుగూడెం మీదుగా 6.5 కిలోమీటర్లకు కోటి రూపాయలు, సీజీ రోడ్డు నుంచి కోనాల వయా జెట్లపాలెం - దర్శిపర్రు, రాచర్ల రోడ్డు వరకు 5.080



కిలోమీటర్లకు రూ.కోటి 50లక్షలు, రమణక్కపేట ఆర్ అండ్‌బీ నుంచి బచ్చువరప్పాడు, జనార్దనపురం మీదగా 3.28 కిలోమీటర్లు 2 కోట్లు, దిర్శుమర్రు నుంచి కోమటితిప్ప నార్త్ - కోలమర్రు కొండేపాడు 8.170 కిలోమీటర్లకు రూ.2కోట్ల 50లక్షలు, పూలపల్లి - ఆగర్తిపాలెం 8.6 కిలోమీటర్లకు రూ.కోటి 70 లక్షలు, కవిటం - ఓడూరు నుంచి యలమంచిలి- కాజా రోడ్డు 4 కిలో మీటర్లుకు రూ.కోటి 70 లక్షలు, నర్సాపురం - మొగల్తూరు, రుస్తుంబాద - కొప్పర్రుల్లో 6.5 కిలోమీటర్లకు రూ.2 కోట్ల 50 లక్షలు, ఉర్థాళ్లపాలెం నుంచి దువ్వ, మార్టేరు-వడలి రోడ్డుకు 9.3 కిలోమీటర్లకు రూ.3 కోట్లు, ఎర్రచెరువు-పి.వేమవరం రోడ్డుకు 3.6 కిలోమీటర్లకు రూ.కోటి 26 లక్షలు, వడ్లూరు - తీపర్రు రోడ్డు 8.5 కిలోమీటర్లకు రూ.3 కోట్ల 24లక్షలు, తేతలి - మునిపల్లి రోడ్డుకు 4 కిలోమీటర్లకు 60లక్షలు, పశివేదల-ఆరికిరేవులు రోడ్డు 4.2 కిలోమీటర్లకు రూ. 2కోట్ల30 లక్షలు నిధులు మంజూరయ్యాయి. వీటిని వర్షాకాలంలోపే చేయడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశామని జిల్లా రోడ్డు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.భరతరత్నం తెలిపారు.

రెచ్చిపోతున్న కాల్‌మనీ గ్యాంగ్..

● ఏలూరు నగరంలో శ్రుతిమించుతున్న ఆగడాలు ● కిడ్నాప్‌లు, దాడులతో వేధింపులు
● భరించలేక ఇటీవల ఒకరి ఆత్మహత్య ● చర్యలు తీసుకోవాలంటూ బాధితుల వేడుకోలు


ఆస్పత్రిలో ఉన్న ఆంజనేయులు, బాధితుడి భార్యతో మాట్లాడుతున్న వడ్డీ వ్యాపారులు(ఫైల్)

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పేదల ఆర్థిక అవసరాలను ఆసరా చేసుకుని కొంత మంది వడ్డీ వ్యాపారులు అనధికారంగా వ్యాపారలు చేస్తూ అధిక వడ్డీలను వసూలు చేస్తూ కాల్‌మనీ కింగ్‌లుగా చెలామణి అవుతున్నారు.వీరికి కొంతమంది నేరచరిత్ర కలిగిన వారు రికవరీ ఏజెంట్లుగా వ్యవహరించడంతో వడ్డీకి సొమ్ములు తీసుకున్న బాధితులు ఆ వడ్డీలు కట్టలేక, అసలు తీర్చలేక ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్నారు. చివరకు ఆత్మహత్యలు కూడా చేసుకుంటున్నారు. మరికొంతమంది బాధితులపై కాల్‌మనీ గ్యాంగ్‌లు, రికవరీ ఏజెంట్లు దాడులకు తెగబడుతున్నారు. కొంత మంది బాధితులు ఫిర్యాదు చేస్తుండగా, మరి కొంతమంది బాధితులు ఫిర్యాదులు చేయలేక భయభ్రాంతులకు గురై మిన్నకుండిపోతున్నారు. ఏలూరు నగరంలో ఇటీవల వడ్డీ వ్యాపారుల జోరు పెరిగిపోయింది. కొంత మంది టెండర్ వ్యాపారం అంటూ సాయంత్రం అయ్యిందంటే రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసే వారి వద్దకు వచ్చి వడ్డీలు వసూలు చేసుకుంటున్నారు. రాత్రి 11 గంటల వరకూ ఇలాంటి వడ్డీ వ్యాపారులు నగరంలో వందలాది మంది అన్ని వ్యాపార సముదాయాల్లో కనిపిస్తూనే ఉంటున్నారు. అప్పు తీసుకున్న వారి వద్ద ఒక చిన్న పుస్తకం రోజుకు ఇంత సొమ్ము చెల్లించాలంటూ ఆ పుస్తకంలో చెల్లించాల్సిన సొమ్మును నమోదు చేస్తున్నారు. లక్ష రూపాయలు అప్పు తీసుకోవాలంటే లక్షకు 17 వేలు తీసుకుని, మరి కొంత మంది 20 వేలు తగ్గించి మిగిలిన సొమ్ములను ఇస్తారు. రోజుకు వెయ్యి రూపాయలు వంతున వంద రోజుల్లో ఆ సొమ్ములను చెల్లించాలి.అదనంగా రోజులు పెరిగాయంటే ఎస్టీడీ వడ్డీలంటూ వసూలు చేస్తున్నారు. ఇదొక ముఠా పనికాగా మరికొన్ని ముఠాలు మాత్రం నూటికి పది రూపాయలు వంతున వడ్డీలకు ఇస్తున్నారు. ఏరోజు వడ్డీ ఆరోజే చెల్లించాలి. లేదా వారాంతపు వడ్డీ చెల్లించాలి. అసలు అలాగే ఉంటుంది. వడ్డీ మాత్రం వారం వారం చెల్లించాల్సిందే. ఇలాంటి ముఠాలకు నగరంలో నేరచరిత్ర కల్గిన కొంత మంది రికవరీ ఏజెంట్లుగా మారి దందాలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం, అనపర్తి ప్రాంతాల నుంచి కొంత మంది ఇక్కడకు వచ్చి వడ్డీ వ్యాపారాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇటీవల కాల్‌మనీ వ్యాపారుల ఆగడాలు ఏలూరు నగరంలో మితిమీరిపోవడంతో కొద్ది నెలల క్రితమే ఐదుగురిని ఏలూరు త్రి టౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. అయితే కొద్ది కాలం ఈ కాల్‌మనీ వ్యాపారులు గప్‌చిప్ మంటూ నిశ్శబ్దంగా ఉన్నా ఇటీవల రెచ్చిపోతున్నారు. ఇటీవల ఏలూరు రూరల్ స్టేషన్ పరిధిలోని ఒక ఆటో డ్రైవర్ తన కుటుంబ అవసరాలు నిమిత్తం అప్పులు చేశాడు. అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నప్పటికీ కూడా వడ్డీకి సొమ్ములిచ్చిన వారు వేధింపులకు గురి చేయడంతో చివరకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతానికి జొన్నకూటి ఆంజనేయులు రాజమహేంద్రవరానికి చెందిన ఒక వ్యాపారి వద్ద 20 వేల రూపాయలు తీసుకున్నాడు. నూటికి పది రూపాయలు వంతున వారం వారం వడ్డీ చెల్లిస్తున్నాడు. అయితే ఇటీవల పనులు లేకపోవడంతో వడ్డీ చెల్లించకపోవడంతో ఏకంగా ఇళ్ళకు ఆ వ్యాపారితో పాటు మరికొంత మంది రికవరీ గ్యాంగ్ వెళ్లి హెచ్చరించారు. ఆంజనేయులు ఎక్కడ కనిపించినా నడిరోడ్డుపై కాలర్ పట్టుకుని కింద పడేసి తంతామని వార్నింగ్ ఇచ్చారు.అన్న ప్రకారమే ఆ గ్యాంగ్ ఈ నెల 2వ తేదీ రాత్రి ఆంజనేయులును ఇంటి నుంచి తీసుకుపోయి అతని వద్ద ఉన్న మోటారుసైకిల్, సెల్‌ఫోన్ తీసుకుని చిత్రహింసలకు గురిచేసి గాయపరిచారు. గాయాలపాలైన అతను కుటుంబ సభ్యుల సహకారంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. ఏలూరు టూటౌన్ పోలీసులు వడ్డీ వ్యాపారిపై, అతనితో పాటు కలిసి ఆంజనేయులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే నగరంలో ఇంకా కొంత మంది వడ్డీ వ్యాపారులు సాయంత్రం అయితే రోడ్ల మీద వ్యాపారుల వద్దకు వెళ్లి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వ్యాపారులపై నిఘా పెట్టి అనధికారికంగా వడ్డీ వ్యాపారం చేస్తూ నిత్యం ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్న వీరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

జేఎన్వీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయం(జేఎన్వీ)లో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పెదవేగి జేఎన్వీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్ కుమార్ చెప్పారు. 2026- 27 విద్యా సంవత్సరానికి సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. అభ్యర్థులు 2025- 26 విద్యా సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. 2014 మే 1వ తేదీ నుంచి 2016 జూలై 31వ తేదీ మధ్య జన్మించినవారు దరఖాస్తు చేయడానికి అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తు చేయడానికి వచ్చే నెల 29వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అభ్యర్థులు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్ హెచ్‌టీటీపీఎస్://ఎన్‌వీవోడీఏవైఏ.జీవోవి.ఐఎన్, హెచ్‌టీటీపీఎస్://సీబీఎస్‌ఈఐటీఈఎమ్.జీవోవీ.ఐఎన్/ఎన్‌వీఎస్ నుంచి వివరాలు తెలుసుకోవచ్చని, డిసెంబరు 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

నిర్వాసితుల భూసేకరణకు క్షేత్ర పరిశీలన

జీలుగుమిల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి చింతూరు డివిజన్ కూనవరం మండలం కొండ్రాజుపేట నిర్వాసితులకు భూసేకరణ చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు జీలుగుమిల్లి మండలంలో ఎర్రవరం సమీపంలోని పొలాల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ క్రమంలో గురువారం చింతూరు ఐటీడీఏ పీవో, అపూర్వ భరత్, ఎస్‌డీసీలు సరళ వందనం, బలరామకృష్ణ, ఆధ్వర్యంలో కొండ్రాజుపేట గ్రామస్థులకు భూమికి భూమి, ఇళ్ల స్థలాలు ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ఆయా భూములు అనుకూలంగా ఉన్నాయో లేదో తెలుసుకుని ఆయా గ్రామ గిరిజనులతో కలిసి పరిశీలించారు. అనంతరం సంబంధిత నివేదికను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. జీలుగుమిల్లి, కూనవరం తహసీల్దార్లు ఉదయ్ భాస్కర్, వెంకటేశ్వరావు, వీఆర్వో తులసీ, సర్వేయర్ అబ్రార్ ఉన్నారు.


పొలాలు పరిశీలిస్తున్న చింతూరు ఐటీడీఏ అధికారులు

క్రైం సమాచారం

వేర్వేరుచోట్ల ఎనిమిది మంది మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల గురువారం మొత్తం ఎనిమిది మంది మృతి చెందారు. కారును ఢీకొట్టిన వ్యాన్ ఘటనలో ఒకరు, బైక్‌ను ఢీకొట్టిన కారు ఘటనలో మరొకరు, కలుపు మందు తాగి ఒకరు మృతి చెందగా.. పాము కాటుతో ఓ మృహిళ మృతి చెందింది. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానానికి దిగిన పెంటపాడు యువకుడు మృతి చెందగా, నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు.

కలుపు మందు తాగి ఒకరి మృతి

టి.నరసాపురం, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : కలుపు మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన టి.నరసాపురం మండలంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. బండివారిగూడెం గ్రామానికి చెందిన పెనుమత్స శ్రీనివాసరాజు(52)కు వివాహమైంది. ఒక కుమారుడు ఉన్నాడు. 20ఏళ్ల క్రితం భార్యభర్తలు మనస్పర్థలతో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి అతడు తల్లితో కలిసి ఉంటున్నాడు. ఒంటరితనం భరించలేక మద్యానికి బానిసై చనిపోవాలనే ఉద్దేశంతో గ్రామశివారులో వున్న కోళ్లఫాం వద్ద కలుపుమందు తాగాడు. సమాచారం తెలుసుకున్న మృతుడి అన్నయ్యలు కారులో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడి తల్లి శకుంతల ఫిర్యాదుతో హెడ్‌కానిస్టేబుల్ ఎం.రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాము కాటుకు మహిళ..

ఏలూరు క్రైం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పాముకాటు వేయడంతో ఒక మహిళ తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురానికి చెందిన పెరుమాళ్ళ సీత(34)కు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం ఉదయం ఆమెను పాము కాటు వేయడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పుష్కరాల రేవులో స్నానానికి దిగిన యువకుడు ప్రమాదవశాత్తూ మునిగిపోయి నీళ్లు తాగి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడెం సమీపంలో పెంటపాడు గ్రామానికి చెందిన పాలిక అభిరామ్(23) స్నేహితులను కలిసేందుకు రాజమహేంద్రవరం వచ్చాడు. స్థానిక శ్రీరాంనగర్‌లో ఉన్న స్నేహితుల వద్దకు వచ్చి అక్కడి నుంచి స్నేహితులతో కలిసి గోదావరి స్నానానికి పుష్కరాల రేవుకు గురువారం సాయంత్రం వెళ్లారు. స్నానం చేస్తుండగా అభిరామ్ ప్రమాదవశాత్తూ మునిగిపోయాడు. అతడిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించే సరికి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ పోలీసులు అభిరామ్ తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక యువకుడు..

నిడదవోలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :ఒంటరితనం భరించలేక ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన ఏజర్ల విక్రమ్(19) తల్లి కువైట్‌లో ఉండగా..తండ్రి వైజాగ్‌లో ఉంటూ చేపల చెరువు వద్ద పనిచేస్తున్నాడు. మంచిలిలో విక్రమ్ ఒక్కడే ఉంటున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం గ్రామంలో ఉన్న మేనత్త ఇంటికి వచ్చాడు. చాలా సేపు అక్కడ గడిపాడు. అనంతరం మేనత్తతో ఒంటరితనం భరించలేకపోతున్న ట్టు చెప్పాడు. మేనత్త ఏదో సర్దిచెప్పింది. అయినా పట్టించుకోలేదు. కాసే పటికే వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేశాడు. గమనించిన బంధువులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ గురువారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ తెలిపారు.

కారును ఢీకొట్టిన వ్యాన్.. ఒకరి మృతి

మొగల్తూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముత్యాలపల్లి వంతెనపై కారు ఐషర్ వ్యాన్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో కారు నడుపుతున్న విద్యాశాఖకు చెందిన సైట్ ఇంజనీర్ కర్రి వెంకటరెడ్డి(45)మృతి చెందారు. ఎస్ఐ జి.వాసు తెలిపిన వివరాలివి.. కృష్ణా జిల్లా బంటుమిల్లిలో విద్యాశాఖలో సైట్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరెడ్డి విధి నిర్వహణలో భాగంగా గురువారం వేకువజామున రాజమహేంద్రవరానికి కారులో బయలుదేరారు. ముత్యాలపల్లి వంతెనపైకి చేరుకున్న సమయంలో మొగల్తూరు నుంచి ఐస్ లోడుతో బంటుమిల్లి వెళుతున్న వ్యాన్ ఎదురుగా వచ్చి కారును ఢీకొనడంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలపాలైన వెంకట రెడ్డిని అత్యవసర వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందాడు. వ్యాన్ ముందు భాగంగా కూడా దెబ్బతింది. వంతెన రెయిలింగ్ ధ్వంసం చేస్తూ కాల్వ వైపునకు వెళ్లి నిలబడింది. అప్రమత్తమైన వ్యాన్ డ్రైవర్ వాహనం నుంచి కిందకు దూకడంతో ప్రాణాలు దక్కాయి. ఐస్ ప్యాకింగ్ బాయ్‌గా పనిచేస్తున్న కోమటితిప్పకు చెందిన శీలం కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మేఘన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


ముత్యాలపల్లి వంతెనపై ఢీకొన్న కారు, వ్యాన్

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు

నరసాపురం రూరల్, జూన్ 5: పట్టణంలోని రుస్తుంబాద టాయ్‌సిటీ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలివి.. పాలకొల్లుకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై సీతారాంపురం వెళుతుండగా.. సీతారాంపురం నుంచి నరసాపురం వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయాలు కాగా అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం తణుకు తరలిస్తుండగా మార్గమధ్యలో కె.పండు(25) అనే యువకుడు మృతి చెందాడు. మరోవైపు ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వ విప్ నాయకర్ ఘటన ప్రదేశానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను స్థానికుల నుంచి ఆరా తీశారు. హైవేపై ముఖ్య కూడళ్లలో వాహనాల వేగాన్ని తగ్గించే విధంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని పోలీసుల్ని ఆదేశించారు.


పండు మృతదేహం

చికిత్స పొందుతూ వృద్ధుడు..

పెంటపాడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. పెంటపాడు గ్రామానికి చెందిన నున్నా పుల్లారావు(70) గత నెల 31న పింఛన్ తీసుకునే నమిత్తం తాడేపల్లిగూడెం మండలం ఉప్పరగూడెం గ్రామానికి తన బంధువు పాలంగి చంటితో కలసి బైక్‌పై వెళ్తున్నాడు. పెంటపాడు ఎస్‌టీవీఎస్ పాఠశాల వద్ద వీరు వెళ్తున్న మోటారుసైకిల్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన పుల్లారావును చికిత్స నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని జరిగిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్ఐ స్వామి తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఉండి, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొట్టిన ప్రమాద ఘటనలో తీవ్రంగా గాయపడిన మోటారుసైక్లిస్టు సప్పా సుబ్రహ్మణ్యం(42) చికిత్స పొందుతూ మృతిచెందాడు. గురువారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి మండలం రామాపురం వద్ద ఈనెల మూడో తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అతడిని భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్టు పోలీసులు తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నయీం అస్మి

రౌడీ షీటర్‌పై పీడీ యాక్టు

భీమవరంటౌన్/భీమవరం క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో తరచూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్న పట్టణానికి చెందిన కొత్తపల్లి విక్టర్ బాబును గూండాగా పరిగణించి పీడీ యాక్టు అమలు చేశామని, అతడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయిం అస్మి తెలిపారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. నిందితుడు కొత్తపల్లి విక్టర్‌బాబుపై వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటు తెరిచారన్నారు. అతడికి ప్రతీరోజు కౌన్సెలింగ్ ఇస్తూ మంచి ప్రవర్తనతో జీవించాలని హెచ్చరించేవారని, అయితే పోలీసు ఆదేశాలను ధిక్కరిస్తూ వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధితో పాటు, ఉండి, కాళ్ల పోలీస్ స్టేషన్ల పరిధుల్లో తరచూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నారన్నారు. ఈమేరకు అతడిపై పీడీ యాక్టు ప్రయోగించి ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నిర్బంధించి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని వివరించారు.

గంజాయి తరలిస్తున్న యువకుడి అరెస్టు

ఏలూరుక్రైం, జూన్5(ఆంధ్రజ్యోతి): గంజాయి తీసుకువెళ్తున్న ఒక యువకుడిని ఏలూరు టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ మధు వెంకటరాజా అరెస్టు చేశారు. ఏలూరు గూడ్స్‌షెడ్డు రోడ్డులో టూటౌన్ సీఐ, ఎస్ఐ, తమ సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. దెందులూరులోని శ్రీసైనిక పేటకు చెందిన తియ్యాల సాయిదుర్గ అనే యువకుడు మోటారు సైకిల్‌పై వస్తుండగా పోలీసులు ఆపారు. అతడు పారిపోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకుని బైక్‌ను తనిఖీ చేయగా ఐదు కేజీల గంజాయి ఉంది. అతడిని అరెస్టు చేసి గురువారం కోర్టుకు హాజరుపరిచారు. రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.

రోడ్డు పనులు ప్రారంభం

అత్తిలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అత్తిలి గ్రామ పంచాయతీ పరిధిలో నాయీ బ్రాహ్మణ వీధిలో గ్రామ పంచాయతీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు అత్తిలి గ్రామ సర్పంచ్ గంటా విజేత భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఎంపీపీ మక్కా సూర్యారావు, తెలుగుదేశం మండల అధ్యక్షులు ఆనాల ఆదినారాయణరావు, ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్ పాల్గొన్నారు.

కామాక్షి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మండలం మిలటరి మాధవరంలో కామాక్షి అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠా కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా సాగింది. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ పూజలు చేశారు. అమ్మవారి ఆలయ ట్రస్టీ రాజన్ శుభాషిని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బందారు నాగరాజు, మాజీ సర్పంచ్ కౌలూరి పరిమళ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి పూజలు చేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు

కాళ్ళ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సీసలి గ్రామంలో పోలేరమ్మ, పోతురాజు ఆలయ పునః నిర్మాణం సందర్భంగా ఆలయంలో రాతి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉదయం 8.49 గంటలకు వేదపండితులు విగ్రహాలు ప్రతిష్ఠ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. గ్రామదేవత విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, జనసేన ఉండి ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అదేవిధంగా సాయంత్రం గ్రామదేవతకు గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కట్రెడ్డి శ్రీనివాసరావు, విజయలక్ష్మి, కట్రెడ్డి సురేష్‌కుమార్, నూకల భోగేంద్రబాబు, వాస్కూరి శ్రీనివాసరావు, తోట రామదాసు పాల్గొన్నారు.

ఉండి: చెరుకువాడలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివార్లను డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు దర్శించుకున్నారు. ఆలయ నిర్మాణం చేసిన వారిని డిప్యూటీ స్పీకర్ అభినందించారు. ఈనెల 8వ తేదీన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పూజలు

ఆచంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆచంట శివారు కౌరుపాలెంలో నూతనంగా నిర్మించనున్న కనకదుర్గ అమ్మవారి ఆలయ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే పితాని పూజలు చేపట్టారు. మాజీ మండల టీడీపీ అధ్యక్షుడు కేతా మీరయ్య, సత్యవతి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు.

లక్ష్మీగణపతి ఆలయానికి శంకుస్థాపన

భీమవరంటౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 7వ వార్డులోని నెహ్రూ కాలనీలో శ్రీలక్ష్మి గణపతి స్వామి వారి నూతన ఆలయానికి రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కారుమూరి సత్యనారాయణ మూర్తి, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ బొక్క చంద్రమోహన్, కడలి వెంకట రమణ (బుజ్జి), హనుమత్ రావు పాల్గొన్నారు

ఆశా కార్యకర్తల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

గణపవరం, జూన్5 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం పిప్పర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి దరకాస్తులు కోరుతున్నామని ప్రభుత్వ వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. ఈ నెల 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు దరకాస్తులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందజేయాలని కోరారు. ఆశాకార్యకర్తలు వయస్సు 25 - 45 సంవత్సరాలు లోపు, ఆయా గ్రామంలో కోడలై ఉండాలని, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలన్నారు. పిప్పర 1వ సచివాలయం, పిప్పర 2వ సచివాలయం, కోమర్రు సచివాలయంలోనూ ఒక్కోపోస్టు ఖాళీ ఉందని తెలిపారు.

మీకు న్యాయం జరుగుతుంది

ఆకివీడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు ఎస్ టర్నింగ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్‌కేర్ ఆసుపత్రిని డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ నెల 3న సంతమార్కెట్‌లోని పడాల వీధిలో అత్యాచారం కాబడిన బాలికను వారి తల్లిదండ్రులు తీసుకొచ్చి ఆర్ఆర్ఆర్‌ను కలిసి తమగోడు వినిపించారు. మీకు న్యాయం జరుగుతుంది, ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, ఆసుపత్రి నిర్వహకుడు బండారు నాగరాజు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి సిద్ధం: ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌ను రూ.300 కోట్లతో అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోని రైల్వే పనులపై సౌత్ సెంట్రల్ డిప్యూటి ఇంజనీర్ పీవీ రమణరావుతో కలిసి తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్, నవాబుపాలెం రైల్వేస్టేషన్, పాతూరు అండర్ పాస్ ప్రాంతం, జువ్వలపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రస్తుతం తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ పరిధిలో రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.23కోట్లు, గూడ్స్ షెడ్‌కు రూ.8 కోట్లు, 374,378,379 బ్రిడ్జ్‌ల నిర్మాణానికి అనుమతులు, జువ్వలపాలెం వద్ద రూ.110 కోట్లతో బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంటనే రైల్వే సినియర్ సెక్షన్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, పాల్గొన్నారు.

హామీలు పూర్తిస్థాయిలో అమలు చేస్తాం

అత్తిలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేస్తున్నట్లు తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలిలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ పాల్గొన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు కూడా చేపట్టి అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పాఠశాలలు తెరిచేలోగా వారి ఖాతాలలో జమ అవుతాయన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఎంపీపీ మక్కా సూర్యారావు అధ్యక్షత వహించారు. మండల ఉపాధ్యక్షురాలు కొనకళ్ళ విజయనిర్మల, సుంకర నాగేశ్వరరావు, జడ్పీటీసీ అడ్డాల జానకి, ఎంపీడీవో పి శ్యామ్యూల్, తహసీల్దార్ దసిక వంశీ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పరిశీలన



స్థానిక అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో దాసిరాజు

పెనుగొండ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు శాశ్వత ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని నరసాపురం ఆర్డీవో దాసిరాజు తెలిపారు. సిద్ధాంతం గ్రామంలో ప్రభుత్వ స్థలాలు, గ్రామ కంఠంలలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహాలను గురువారం పరిశీలించారు. సిద్ధాంతంలో 6 ఇళ్ళు, దేవలో 17 ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనిత కుమారి, వీఆర్వో వెంకటేశ్వరరావు, చిన్నా, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చదరంగం పోటీలు ప్రారంభం

భీమవరం అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): అనసూయ చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఇన్విటేషన్ చెస్ టోర్నమెంట్ భీమవరం ఆర్యవైశ్య యువజన సంఘ భవనంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భీమవరం శాసన సభ్యులు పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) చెస్ పోటీలను ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, జిల్లా చదరంగం అసోసియేషన్ అధ్యక్షులు మాదాసు కిషోర్, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షులు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఏదీ స్పందన

(5వ పేజీ తరువాయి)

రాయితీ వర్తించాలంటే జిల్లాలో 91 వేల ఎకరాల్లో చెరువులను రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రైతులకు రిజిస్ట్రేషన్ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. నాణ్యమైన సీడ్ ఇవ్వకపోతే సదరు హాచరీపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వపరంగా రాయితీలు వర్తించనున్నాయి. ఆక్వా సాగు పెంచడానికి కేంద్రం అనేక ప్రోత్సాహకాలు ఇస్తోంది. పెద్ద రైతులు మాత్రమే ఇప్పటి వరకు లబ్ధి పొందుతూ వచ్చారు. ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ ప్రోత్సాహకాలు లభించనున్నాయి. ప్రధానంగా రిజిస్ట్రేషన్ జాబితాలో నమోదు కాని చెరువులకు విద్యుత్ రాయితీ అమలు కాదు. త్వరలోనే రైతులకు అవగాహన కల్పిస్తారు నోటీసులు జారీచేస్తారు.



భీమవరంలో ఎమ్మెల్యే రామాంజనేయులు.. తాడేపల్లిగూడెంలో ఎమ్మెల్యే బొలిశెట్టి.. ఆచంటలో ఎమ్మెల్యే పితాని.. భీమవరం ఆర్ఎం కార్యాలయం వద్ద ప్రజారవాణా అధికారి ప్రసాద్ మొక్కలు నాటుతున్న దృశ్యం

పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత

పర్యావరణ పరిరక్షణకు కదిలిన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు.. ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటిన అధికారులు

భీమవరం టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మానవ మనుగడకు పర్యావరణాన్ని కాపాడుకోవలసిన అవసరం ఉన్నదని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం బ్యాంక్ కాలనీలో ఎమ్మెల్యే మొక్కలను నాటారు. మైత్రి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గణపవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గణపవరం మండల గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పిప్పరలో మొక్కలునాటే కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు దాట్ల రంగరాజు, జనసేన మండల నాయకుడు కొలనువాడ శ్రీనివాసరాజు పాల్గొన్నారు. గణపవరంలో ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, సర్పంచ్ మూరా అలంకారం, మండల జనసేన అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆకివీడు: నగర పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో కమిషనర్ జి.కృష్ణమోహన్ మొక్కలు నాటి మాట్లాడారు. చెట్లు నాటితే క్షేమమని, నరికితే క్షామమన్నారు. పచ్చదనం మన ప్రగతికి సంకేతమన్నారు.

ఆకివీడు రూరల్: గుమ్ములూరులో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ చేపట్టారు. ఎంపీటీసీ కోపల్లె హనుమ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 500 మొక్కలను పంపిణీ చేశారు.

తణుకు: పర్యావరణ, పరిరక్షణకు ప్రతి ఒక్కరు ఒక మొక్కనాటే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. గురువారం కోటి మొక్కల వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం వెంకట్రాయపురం పార్కులో నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తులు కె.కృష్ణ సత్యలత, కె.కృష్ణవేణి మొక్కలు నాటారు.

భీమవరం టౌన్: పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరమని, వాతావరణంలో సమతుల్యత లోపించటంతో అనేక అనర్థాలు చోటు చేసుకునే ప్రమాదం ఉందని అందుకే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఆర్టీసీ ప్రజా రవాణాధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా ప్రజారవాణాధికారి ప్రాంగణంలో మొక్కలను నాటి మాట్లాడారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, అకౌంట్స్ ఆఫీసర్ ఎన్‌వీరావు, డిపో అసిస్టెంట్ మేనేజర్ పినురేష్, కె ప్రకాష్, కె.శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డిపో మేనేజర్ పి.సత్యనారాయణ మూర్తి మొక్కలు నాటారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ వై.సురేష్, యూనియన్ నాయకులు వైవీ రావు, ఎస్.రమేష్ బాబు, పి సోమరాజు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని డివిజన్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి పిలుపునిచ్చారు. వైఎన్ ఎన్ఎస్ఎస్, న్యాయ సేవాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. అనంతరం న్యాయ మూర్తి వరలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను పూర్తిగా నియంత్రించాలన్నారు. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ, రంగనీడి సుబ్బారావు, ప్రిన్సిపాల్ చింతారావు, వెంకటరత్నం, బాలాజీ, దానయ్యనాయుడు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్/రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఏసుబాబు, మునిసిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణ, అడబాల నారాయణమూర్తి, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి పాల్గొన్నారు. మిలటరి మాధవరంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మొక్కలు నాటారు. సర్పంచ్ తాడేపల్లి బేబీ, ఉపసర్పంచ్ బందారు నాగరాజు పాల్గొన్నారు. పెదతాడేపల్లిలో సర్పంచ్ పోతుల అన్నవరం ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపీడీవో ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

ఆచంట: ఆచంట సీహెచ్‌సీ వద్ద ఎమ్మెల్యే పితాని మొక్కలు నాటారట. కార్యక్రమంలో ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, మండల టీడీపీ అధ్యక్షుడు చిలుకూరి సీతారామ్, డీసీ ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్, పృధ్వి, ఎంపీడవో పూర్ణబాబ్జి, కార్యదర్శి నాగబాబు తదితరులు పాల్గొన్నారు.



గణపవరం, ఆకివీడులలో యోగా సాధన

దిన చర్యలో యోగా ఒక భాగం కావాలి

పలు ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు

గణపవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): యోగా సర్వరోగ నివారిణి అని, మన దినచర్యలో యోగా ఒక భాగం కావాలని లలితాపిరమిడ్ ధ్యాన కేంద్రం మాస్టర్ పెరుమాళ్ల మురళీకృష్ణ అన్నారు. గణపవరం బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది యోగాపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ బేబి శ్రీలక్ష్మి ప్రాణయామం, సూర్యనమస్కారాలు, ఆసనాల గురించి వివరించారు.

ఆకివీడు:

బాలికల ఉన్నత పాఠశాలలో ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు యోగా గురువు పుదిశె వెంకట భీమేశ్వరరావు, పాఠశాల పీడీ కూనా నీలవేణి యోగా, ఆసన, ప్రాణాయామం, ధ్యానం చేయించారు. యోగాపై అవగాహన తెచ్చుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నారు.

టీడీపీ కమిటీలు సమన్వయంతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తోట సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భీమవరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి అధ్యక్షతన వీరవాసరం, భీమవరం మండలాలు, భీమవరం పట్టణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు తోట సీతారామలక్ష్మికి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ కమిటీ నాయకులంతా సమన్వయంతో పనిచేస్తూ ముందుకు వెళ్ళాలన్నారు. వీరవాసరం మండల టీడీపీ కమిటీ అధ్యక్షునిగా కొల్లేపర శ్రీనివాస్, ఉపాధ్యక్షునిగా యరకరాజు గోపాలకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా వీరవల్లి శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మేక వెంకట సుబ్బారావు, బండి నాగలక్ష్మి, బయనపాలెం సత్యనారాయణ, కార్యదర్శులుగా దూసనపూడి వెంకటేశ్వరరావు, నేపాల నాగమల్లేశ్వరరావు, మురాళ్ళ ఏసురత్నం, కోశాధికారిగా ఆదిరెడ్డి శ్రీనివాస్‌లు, పది మంది కార్యవర్గ కమిటీని నియమించారు. భీమవరం మండల టీడీపీ కమిటీ అధ్యక్షునిగా కొయ్యలగడ్డ గణపతి, ఉపాధ్యక్షునిగా పెనుమత్స సుమన్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా కోళ్ళ సీతారాం, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బొక్కా వెంకటాంజన, రేవులగడ్డ మేరీరత్నం, నడకుడితి సత్యనారాయణ, కార్యదర్శులుగా చింతపల్లి జీవరత్నం, బస్వాని వెంకటరమణ, కుక్కల తారక రామారావు, కోశాధికారిగా పెంటపాటి రిషికేశ్వరరావు, పది మందితో కార్యవర్గాన్ని నియమించారు. భీమవరం పట్టణ టీడీపీ అధ్యక్షునిగా మద్దుల రాము, ఉపాధ్యక్షునిగా కొత్తపల్లి అప్పలరాజు, ప్రధాన కార్యదర్శిగా చెల్లబోయిన గోవిందరావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నేదునూరి గంగాధర్ తిలక్, సతివాడ హరిబాబు, ఎండి అస్లంపాషా, కార్యదర్శిగా యాళ్ళ సురేష్‌బాబు, చోడిశెట్టి నారాయణస్వామి, గందం రాధ, కోశాధికారిగా మండవల్లి ఈశ్వర్ పది మంది కార్యవర్గ కమిటీని నియమించారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ప్రత్తిపాడులో ఉద్రిక్తత

పెంటపాడు, మే 5(ఆంధ్రజ్యోతి) : ప్రత్తిపాడులో దాతల సహకారంతో నూతనంగా నిర్మాణం చేస్తున్న శివాలయం వద్ద గురువారం ఉద్రిక్తత చోటు చేసుకున్నది. నిర్మాణంలో ఉన్న స్థలం ప్రభుత్వానికి చెందిందంటూ ఇద్దరు వ్యక్తులు హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు నిర్మాణాన్ని ఆపేందుకు అధికారులు పోలీసుల సహకారంతో శివాలయం వద్దకు వచ్చారు. అప్పటికే గ్రామస్థులు కూడా పెద్ద ఎత్తున గుమిగూడారు. అధికారుల ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. అధికారులు, గ్రామస్థుల మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. అనంతరం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అధికారుల విధులకు అడ్డురావద్దని గ్రామస్థులకు నచ్చచెప్పారు. దీనిపై ఉన్నతాధికారులతో తాను మాట్లాడతానన్నారు. శివాలయం నిర్మాణం కావడానికి చర్యలు చేపడతానని గ్రామస్థులకు తెలిపారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

పెనుగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో డబ్బులు తీసుకుని చాలా మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి పట్టాలు ఇస్తామని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. దొంగరావిపాలెం, సిద్ధాంతం గ్రామాల్లో పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల ప్రేమ, అభిమానంతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్కువగా మురుగు డ్రెయిన్, పింఛన్ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి వచ్చాయి. సిద్ధాంతం శ్మశాన వాటిక సమస్య, పుష్కరఘాట్ సమస్యలు వచ్చాయని వాటిని 2026-27 లోపు సుందరవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గనిరాజు, మండల అధ్యక్షుడు లోకేశ్వరరావు, గ్రామ అధ్యక్షుడు ఉండవల్లి సత్యనారాయణ, మన్నె రమేష్, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

మూగజీవాలను వధించినా, హింసించినా కఠిన చర్యలు

భీమవరం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మూగజీవాలను హింసించినా, వధించినా, అక్రమంగా రవాణా చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని జిల్లా రెవెన్యూ అధికారి మొగలి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా జంతు సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ మనుషుల మాదిరిగానే జంతువులకు కూడా ఆకలి, దప్పిక, స్పర్శ కలిగి ఉంటాయని, సహజసిద్ధ వాతావరణంలో జీవించాలని కోరుకుంటాయన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులు, దూడలను వధిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. తొలుత గోవధ నిషేధ చట్టంపై అవగాహన కలిగించే గోడ పత్రికను ఆవిష్కరించారు.

వృద్ధులకు రేషన్ పంపిణీ

నరసాపురం టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాధవాయిపాలెం యనాదుల కాలనీలో రేషన్ తెచ్చుకోలేని వృద్ధులకు తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ దగ్గరుండి రేషన్ సరుకుల్ని లబ్ధిదారుల ఇంటి వద్దేనే పంపిణీ చేశారు. 65 ఏళ్ల పైబడి ఉన్న వృద్ధులు, దివ్యాంగులు రేషన్‌షాపులకు వెళ్లనవసరం లేదన్నారు. సంబంధింత డీలర్ లబ్ధిదారుల ఇంటికి వచ్చి వేలిముద్ర వేయించుకుని రేషన్‌ను అందిస్తారన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ వై.వెంకటేష్

స్వర్ణాంధ్రలో పరిశోధన, నైపుణ్యాలపై శిక్షణ

నరసాపురం రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగామ్‌లో భాగంగా నాల్గోవ రోజు గురువారం అధ్యాపకులకు పరిశోధన, రచన, నైపుణ్యాలపై శిక్షణ సదస్సు నిర్వహించారు. దీనికి కళాశాలకు చెందిన రిసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ వై.వెంకటేష్ విచ్చేసి అధ్యాపకులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. అధ్యాపకులకు రెండు విభాగాలుగా శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం ఈ నాలుగు రోజులుగా జరిగిన శిక్షణపై ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. 40 మంది అధ్యాపకులు పరీక్ష రాసేందుకు ఉత్సాహం చూపించారు. కార్యక్రమంలో చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాథ్, డైరెక్టర్ ఆడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గోపిచంద్ పాల్గొన్నారు.

భోజనంపై జాగ్రత్తలు పాటించండి

ఇరగవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో నిర్వహించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని మండల విద్యాశాఖాధికారి -2 జీబీవీ ప్రసాదరావు సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంట సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వంట గది పరిసరాలు శుభ్రంగా ఉండాలని, చేతులకు గ్లౌజులు, హెడ్ క్యాప్ ధరించి మెనూను తప్పకుండా పాటిస్తూ వంటలు వండాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం రిసోర్స్ పర్సన్ రమాదేవి మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు శుభ్రం చేసే విధానాలు తెలిపారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు యూబీఐ రుణాలు

మొగల్తూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన రైతులకు యూనియన్ బ్యాంకు ద్వారా రుణాలు అందిస్తున్నట్టు ఆ బ్యాంకు రీజినల్ అధికారులు వెంకన్నబాబు, శ్రీధర్, లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. గురువారం బ్యాంకు ఆవరణలో వ్యవసాయం, పాడి, పశువులు, ఉద్యానవన, కోళ్ళు, మేకల పెంపకం రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. తక్కువ వడ్డీతో పాటు ప్రభుత్వ రాయితీలు వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఈసమావేశంలో బ్రాంచ్ మేనేజర్ వై.మధుబాబు, మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్, పశువైద్యాధికారి నీలిమ, రైతులు పాల్గొన్నారు.

జంతువధ నిషేధం పోస్టర్ ఆవిష్కరణ

అత్తిలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా జంతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంతు వధ నిషేధం పోస్టర్‌ను తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేధమన్నారు. వాటిని వధించిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటారని తెలిపారు. జిల్లా జంతు సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్‌కుమార్, ఎంపీపీ మక్కా సూర్యారావు, జడ్పీటీసీ అడ్డాల జానకి, మండల ఉపాధ్యక్షులు సుంకర నాగేశ్వరరావు, కొనకళ్ళ విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

రైతులు బిల్లులు తీసుకోవాలి

అత్తిలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రైతులు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని డాట్ కో ఆర్డినేటర్ ఫణికుమార్ అన్నారు. సార్వా పంటకు అనవసరంగా ఎరువులు వాడొద్దని అన్నారు. అత్తిలి మండలం ఉనికిలి గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దమ్ములో తప్ప ఇతర సమయంలో కాంప్లెక్స్ ఎరువులు వాడరాదని సూచించారు. ప్రత్యామ్నాయ పంటలు, ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ తోటలపై మార్టేరు పరిశోధనా స్థానంలో గల ఆయిల్‌పామ్ శాస్త్రవేత్త ఎంవీ ప్రసాద్ అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్ర వేత్త దిబోరా, డాక్టర్ బిందు ప్రవీణ, మండల వ్యవసాయాధికారి రాజేష్ పాల్గొన్నారు.

ఎస్వీకేపీ విద్యార్థులు ప్రతిభా అవార్డులకు ఎంపిక



ఆదిత్య యశ్వంత్



ఆనంద కుమార్

పెనుగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలలో పెనుగొండ ఎస్వీకేపీ మరియు వీవీ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిభ అవార్డులకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కొల్లి వెంకటరామ సూర్యనారాయణ తెలిపారు. పెనుగొండకు చెందిన బాదంపూడి ఆనంద కుమార్(హెచ్ఈసీ గ్రూపులో 917 మార్కులు) కొండవీటి ఎస్‌జీఎస్ఆర్ఎస్ ఆదిత్య యశస్వి తన గ్రూపులో 987 మార్కులు సాధించి జనరల్ కేటగిరిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల పాలకవర్గ అధ్యక్షులు తాడి నాగిరెడ్డి, సెక్రటరి అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ అభినందించారు.

వలవల నియామకంపై జీవో జారీ

తాడేపల్లిగూడెం అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జిని భవనాలు మరియు కార్మిక సంక్షేమ మండలి చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఈ మేరకు దీనికి సంబంధించి గురువారం జీవో జారీ చేసింది.

వైసీపీ యూత్ నాయకుడు చందు మృతి

ఆచంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆచంటకు చెందిన వైసీపీ యూత్ నాయకుడు నల్లూరి చందు (48) గురువారం మృతి చెందారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. వాలీబాల్ షటిల్ లాంటి క్రీడల్లో కూడా చందు ప్రతిభ కనబరిచారు. చందు ఆకస్మిక మృతి పై పలువురు తమ సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, సర్పంచ్‌లు కోట సరోజిని వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, బోడపాటి బుల్లియ్య, పెచ్చెట్టి సత్యనారాయణ, నంబూరి రాజా సంతాపం వ్యక్తం చేశారు.

కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలి

భీమవరం అర్బన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని జూలై 9న దేశవ్యాప్తంగా సమ్మె జరగనున్నది. ఈ నేపథ్యంలో సమ్మె జయప్రదానికి దశలవారీ కార్యక్రమాలను నిర్వహించాలని సీఐటీయూ పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ నిర్ణయించింది. గురువారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో జేఎన్‌వీ గోపాలన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. రాజా రామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ గత నెలలో జరగాల్సిన సమ్మె యుద్ధం కారణంగా కేంద్ర కార్మిక సంఘాలు సమ్మెను వాయిదా వేసి జూలై 9న జరపాలని నిర్ణయించాయన్నారు.

వృద్ధుల ఇంటి వద్దకే రేషన్

మొగల్తూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులకు రేషన్ సరుకులు వారి ఇంటి వద్దకువెళ్ళి ఇవ్వాలని తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ సూచించారు. గురువారం మొగల్తూరు పంచాయతీ పరిధి కుక్కలవారితోటలో పక్షవాతంతో బాధపడుతున్న కుక్కల హనుమంతరావు, గుత్తుల ముత్యాలమ్మ, గుబ్బల ఝాన్సీ లక్ష్మీలఇళ్లకు ఆయన స్వయంగా వెళ్ళి రేషన్ సరుకులు అందించారు.